కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ


పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమీర్‌పేట: దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నేత సీపీ వేణు గోపాల స్వామి అన్నారు.బుధవారం అమీర్‌పేట డివిజన్‌లోని బల్కంపేట ప్రాంతంలో పాదయాత్ర చేస్తూ మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు మద్దతుగా సికింద్రాబాద్‌లో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తాము కాంగ్రెస్ ఫర్ సికింద్రాబాద్ అనే వర్కింగ్ ప్రొఫెషనల్స్‌తో కూడిన వలంటరీ సంస్థను ఏర్పాటు చేశామని దీని ద్వారా పార్లమెంట్ పరిధిలోని అన్ని డివిజన్లలో పాదయాత్ర చేసి సమస్యలకు పరిష్కారం చూపనున్నామన్నారు. పాదయాత్రలో హర్ష, గౌరీ,రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మ జాతర సందడి



పద్మారావునగర్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో సమ్మక్క–సారలమ్మ జాతర సందడి ప్రారంభమైయింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహా జాతర కోసం అమ్మవారికి బంగారాన్ని(బెల్లం) సమర్పించడానికి దుకాణాల ముందు క్యూ కట్టారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి బెల్లం కొనుగోలు చేస్తుండటంతో మోండా మార్కెట్ ప్రధాన రహదారుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఏడేళ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర కోసం సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున భక్తులు వాహనాల్లో తరలివస్తున్నారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు పోరాడతాం


గణపతి ఆలయంలో పూజలు చేసిన సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసి లష్కర్ జిల్లా సాధన సమితి కార్యాలయాన్ని బుధవారం సీతాఫల్‌మండిలో ఏర్పాటు చేశారు. 13 మంది కమిటీ ప్రతినిధులతో సమితి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో ప్రత్యేక జిల్లా సాధన కోసం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాదంబాల్‌రాజ్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలను కలుపుతూ సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం హైదరాబాద్ జిల్లా ప్రాముఖ్యత కోసం మాత్రమే సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు ప్రతిపాదనను పక్కన పెట్టారని ఆరోపించారు. కేవలం రెండు మూడు నియోజకవర్గాల పరిధితోనే కొన్ని కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిందని, 12 నియోజకవర్గాలున్న హైదరాబాద్ జిల్లాను రెండుగా విభజించడంలో అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు. జిల్లా ఏర్పాటు వరకు ఏడు నియోజకవర్గాల ప్రజలను జాగృతం చేసి జిల్లా ఏర్పాటు ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి బాబురావు, శైలేందర్, కృష్ణ, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రసాగర్, అశోక్, అజీజ్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


అవగాహన కల్పిస్తున్న దివ్యదిశ సంస్థ ప్రతినిధులు

అడ్డగుట్ట: మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని దివ్యదిశ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ దీపక్ కుమార్ అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని శాస్త్రినగర్‌లో రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు నక్కశోభ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యం తరహా మానసిక ఆరోగ్యం కూడా పూర్తి ఆరోగ్యంలో భాగమన్నారు. మానసిక ఆరోగ్యం మన జీవితాన్ని ఆనందంగా గడపడానికి, ఒత్తిడిని ఎదుర్కునేందుకు అదే విధంగా కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం అన్ని వయస్సుల వారిలో మానసిక ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని అందువల్ల ముందస్తు నివారణ అవసరం ఎంతైనా ఉందన్నారు. మానసికంగా కృంగిపోతున్న వారిలో మనోధైర్యం కల్పించి వారిని చైతన్య పరిచేందుకు బస్తీలు, కాలనీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, పద్మ, పూజ పాల్గొన్నారు.

బ్రదర్స్.. అదుర్స్


జగన్, శ్రీనివాస్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: సమయం కలిసివస్తే పట్టిందల్లా బంగారం అవుతుందనటానికి ఈ అన్నదమ్ములిద్దరూ నిదర్శనం. ఓయూలో ఉన్నత విద్యలను అభ్యసించి ఇక్కడే హోదాగల ఉద్యోగాలు సాధించారు. అన్న జగన్ ఏసీపీగా, తమ్ముడు డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ రావు కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతూ చీఫ్ వార్డెన్ పదవిలో సేవలందిస్తున్నారు. పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ఉన్న ఉద్యోగాలు సాధించిన వీరు నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం. గతంలో ఓయూ సీఐగా పని చేసిన జగన్ (15న) నేడు ఓయూ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

హుస్సేన్‌సాగర్‌లో దూకి
మహిళ ఆత్మహత్య


మహిళ మృతదేహం

రాంగోపాల్‌పేట్: హుస్సేన్‌సాగర్‌లో దూకి గుర్తు తెలియని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సెక్రెటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ట్యాంక్‌బండ్‌పై గురజాడ అప్పారావు విగ్రహం ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ పార్కు ఎదురుగా హుస్సేన్‌సాగర్ జలాల్లో ఓ మహిళ (35) మృతదేహం తేలియాడుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి వెలికితీశారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి ఒంటిపై బ్రౌన్ కలర్ చీర, పసుపు రంగు స్వెటర్, చేతిపైఅమ్మ, నాన్న అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బోర్డులో నోటీసుల రగడ!

- అధికారుల నిర్ణయానికి నామినేటెడ్ సభ్యుడి అడ్డు
- ఆగ్రహం వ్యక్తం చేసిన సీఈఓ
- పదోన్నతులు, కారుణ్య నియామకాలకు ఆమోదం



బోర్డు సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు, అధికారులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశం రసవత్తరంగా సాగింది. అక్రమ నిర్మాణదారులకు జారీ చేసే నోటీసుల విషయంలో అధికారులు, నామినేటెడ్ సభ్యుడి మధ్య వాడివేడి చర్చ సాగింది. కూల్చివేతలకు సంబంధించిన నోటీసులు జారీ చేసే ప్రతీసారి బోర్డు అనుమతి తీసుకోవాల్సిందేనంటూ బోర్డు సభ్యుడు రామకృష్ణ పట్టుబట్టడంతో సీఈఓ మధుకర్ నాయక్ తీవ్రస్థాయిలో ప్రతి స్పందించారు. దీంతో రామకృష్ణ వెనక్కి తగ్గడంతో తదుపరి సమావేశం సజావుగా సాగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోర్డు సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణ, జాయింట్ సీఈఓ ఆకాశ్ కుమార్ శర్మ, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ఆలస్యం చేస్తే మీకేం లాభం..?

అక్రమ నిర్మాణాలకు సంబంధించి జారీచేసే సెక్షన్ 248 నోటీసు (అక్రమం నిర్మాణం ఆపాలంటూ ఇచ్చే నోటీసు)తో పాటే తదనుగుణంగా 30 రోజుల తర్వాత ఇచ్చే సెక్షన్ 320 నోటీసు (అక్రమ నిర్మాణం కూల్చివేస్తామంటూ ఇచ్చే నోటీసు)కు ఒకేసారి బోర్డు ఆమోదం తీసుకునేలా సీఈఓ ప్రతిపాదించారు. అయితే కూల్చివేత నోటీసులకు సైతం ప్రత్యేకంగా బోర్డు ఆమోదం తీసుకోవాల్సిందేనని బోర్డు సభ్యుడు పట్టుబట్టారు. సెక్షన్ 248 నోటీసులను ధిక్కరించిన వారికే, సెక్షన్ 320 నోటీసులు ఇస్తామని, ప్రతీసారి బోర్డు తీర్మానం వల్ల జాప్యం జరుగుతుందని సీఈఓ వివరించారు. 2010 నుంచీ ఇదే తరహా కొనసాగిస్తున్నామని అధ్యక్షుడు సోమశంకర్ సైతం ఉద్ఘాటించారు. అయినప్పటికీ రామకృష్ణ వినకపోవడంతో సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారమే తాము నోటీసులు ఇస్తామని చెబుతుంటే, కావాలనే జాప్యం కోసం పట్టుబడుతూ ఉండటం వల్ల మీ కేం లాభం అంటూ సీఈఓ, రామకృష్ణను ప్రశ్నించారు. బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, నామినేటెడ్ పదవి కూడా కోల్పోయే ప్రమాదముంటుందని హెచ్చరించారు. దీంతో రామకృష్ణ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ అంశంపై సమాధా నం ఇచ్చేందుకు కంటోన్మెంట్ లీగల్ సెల్ అడ్వొకేట్ కోటేశ్వరరావు సైతం బోర్డు సమావేశానికి హాజరు కావడం విశేషం. సమావేశం అనంతరం సెక్షన్ 320 నోటీసులకు సంబంధించిన అప్పీలు, ఇతరత్రా అంశాలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

చర్చకు వచ్చిన అంశాలివే..

- బోర్డు సమావేశం ప్రారంభమైన వెంటనే తాగునీటి బిల్లుల పంపిణీ, వసూళ్లకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్ వినియోగానికి సంబంధించిన సర్క్యులర్ ఎజెండా అంశంపై చర్చించారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా కంటోన్మెంట్‌లలో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌కు భిన్నంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని నిర్ణయించారు. ఉచిత మంచినీటి పథకం అమలు, మీటర్ల బిగింపు, బస్తీలకు బిల్లుల మినహాయింపులు తదితర అంశాల వల్ల జీహెచ్‌ఎంసీ పరిధిలో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌నే ఇక్కడా వినియోగించాలని నిర్ణయించారు.
- కంటోన్మెంట్‌లో నూతనంగా వేయనున్న బోర్‌వెల్స్, వినియోగానికి సంబంధించి రూపొందించిన విధి, విధానాలు అమలుకు బోర్డు ఆమోదం తెలిపింది.
- పరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఉన్న సెయింట్ జాన్స్ బాప్టిస్ట్ చర్చ్ అభివృద్ధి పనులకు బోర్డు ఆమోదం తెలిపింది.
- కంటోన్మెంట్ ఇంజినీర్ గోపాలకృష్ణ దాస్, చీఫ్ కంటోన్మెంట్ ప్లానర్ బాలకృష్ణ మార్చి నెలాఖరున పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో వారి స్థానంలో ఉమాశంకర్, ఫణికుమార్ కు పదోన్నతులు కల్పించేందుకు బోర్డు తీర్మానం ఆమోదించారు.
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. తొలి విడతలో 21 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు తీర్మానించారు.
- కంటోన్మెంట్ వ్యాప్తంగా వివిధ భవనాలపై ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని బోర్డు తీర్మానించింది.

సీఎం సహకారంపై ఆశలు..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీగా కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి ఎంతగానో సహకరించారని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే, బొల్లారం ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిందిగా సీఎం ప్రత్యేక కార్యదర్శికి సూచించినట్లు వెల్లడించారు. అందులో భాగంగా పలు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


పవర్ బోర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీ నిధులతో తార్నాక డివిజన్ పరిధిలోని మారుతీనగర్, మాణికేశ్వర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పవర్ బోర్లను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే తన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పలు సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట..

బౌద్ధనగర్: పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసే ఏకైక ప్రభుత్వం బీజేపీ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎల్ఎస్.నగర్, న్యూ అశోక్ నగర్ ప్రాంతాలలో రూ. 12 లక్షల వ్యయంతో పవర్ బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగనుందని, కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, రవిప్రసాద్ గౌడ్, హనుమంత్ ముదిరాజ్, ఓములు పాల్గొన్నారు.

నేటి నాయకులకు దామోదరం సంజీవయ్య ఆదర్శం


నివాళులర్పిస్తున్న వీహెచ్ తదితరులు

రాంగోపాల్‌పేట్: రాజకీయ జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేసిన దామోదరం సంజీవయ్య నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని మాజీ రాజ్యసభ సభ్యులు హన్మంతరావు అన్నారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ సంజీవయ్య పార్కులోని ఆయన ఘాట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వీహెచ్ నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు మార్లు ఏఐసీసీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి, ముఖ్యమంత్రిగా పనిచేశారని ఎలాంటి స్వార్థం లేకుండా పని చేసిని గొప్ప వ్యక్తి దామోదరం సంజీవయ్య అన్నారు. అంబేడ్కర్ ఆలోచనలు పాటిస్తూ చనిపోయిన సమయంలో కనీసం సొంత ఇల్లు కూడా లేకుండా ఉన్న వ్యక్తి అన్నారు. కర్నూలు జిల్లాలోని సొంత ఊరిలో ఆయన ఉన్న ఇల్లు చూస్తే చాలా బాధాకరంగా ఉందని, రాహుల్ గాంధీ దాన్ని పరిశీలించారని, పవన్ కల్యాణ్ కూడా పరిశీలించి కోటి రూపాయలు విరాళం ఇస్తానని ప్రకటించారని చెప్పారు. సంజీవయ్య ట్రస్టు చైర్మన్‌గా తన ఉద్దేశం ప్రకారం ఆయన ఇంటిని ఒక స్మారక చిహ్నంగా మారిస్తే అట్టడుగు వర్గాల నుంచి వచ్చి ఉన్నత స్థాయికి చేరుకున్న వ్యక్తిగా ఈ స్థాయికి ఎలా చేరుకున్నారనేది రాబోయే తరం వాళ్లకు స్ఫూర్తిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అగ్రిటెక్ ఎగ్జిబిషన్



సమావేశంలో పాల్గొన్న అశోక్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి

అమీర్‌పేట: నగరంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అగ్రిటెక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మ్యారీ గోల్డ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐఐ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16,17,18వ తేదీల్లో ఎగ్జిబిషన్ ఉంటుందని వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, ఆధునిక పరిజ్ఞానంపై చర్చలు జరుగుతాయన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతు ఏరకమైన పంటలు పండించాలనే దానిపై నిపుణులు వివరిస్తారన్నారు .ఈ సమావేశంలో శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, అనిల్‌కుమార్, షేక్ సముయుద్దీన్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం తుకారాంగేట్‌లోని సుభాష్ బొమ్మ వద్ద నిరసన తెలుపుతూ మాట్లాడారు. 'అచ్చేదిన్ ఆగయే' అంటూ ఈ పదేళ్ల అధికారంలో ఉన్న ప్రధాని మోదీ నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్ ధరలు ఆకాశానికి ఎత్తి సామాన్య ప్రజలకు సచ్చేదిన్ తీసుకొచ్చారని విమర్శించారు. కులమతాలకు అతీతంగా దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలో రాయబడిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తుందన్నారు.బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె(భారత్‌బంద్)ను జయప్రదం చేసేలా కార్మికులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి బాబు, యాదగిరి, కాసిం , రంజిత్, శంకరయ్య, డేవిడ్, శ్రీహరి, బాలరాజు, రామస్వామి పాల్గొన్నారు.

గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా వరప్రసాద్



బన్సీలాల్‌పేట్: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రవి ముషీరాబాద్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అయితే గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా డీకే మహేశ్వర్‌రావు నియమిస్తూ ఆదేశాలు జారీ కాగా మహేశ్వర్‌రావు సిక్ లీవ్ పెట్టడంతో ఆయన స్థానంలో దోమలగూడ డీఐ ఎం. వరప్రసాద్‌కు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

రేపు జాబ్ ఫెయిర్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్, నేషనల్ కెరీర్ సర్వీసెస్ సంయుక్తంగా ఈ నెల 16న జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు దిశ కో–ఆర్డినేటర్ ఐవన్‌వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. దాదాపు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పది, ఇంటర్, డిగ్రీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, జీడీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, ఐటీఐ, డిప్లామా కోర్సులు పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరవ్వాలన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా 'క్యాంపస్ టూ కార్పొరేట్'

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేసే 'క్యాంపస్ టు కార్పొరేట్' కార్యక్రమాన్ని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.శ్రీనాథ్ ప్రారంభించారు. యువతలో నైపుణ్యాలు–ఉపాధి కల్పన అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ), తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్–నాలెడ్జ్ (టాస్క్), ఆహాన్ కన్సల్టింగ్‌లు దీనిని నిర్వహిస్తున్నాయని ఈ ఏడాదిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన దాదాపు 5000 మంది ఆఖరి సంవత్సరం డిప్లొమా విద్యార్థుల ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 24 మందిని నాంపల్లి ఏడో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 16 మందికి జరిమానా విధించారు. మొదటిసారి పట్టుబడ్డ ఆరుగురికి రెండు రోజుల జైలుశిక్ష రూ.2,100 జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడ్డ ఇద్దరికి నాలుగు రోజుల జైలుశిక్షతో పాటు రూ.3,300ల జరిమానా విధిస్తూ జడ్జి స్పందన తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ జోనల్ కమిషనర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. విక్టోరియా రాణిగంజ్‌లో మొదటి అంతస్తు నిర్మించినా మిగతా పనులు పూర్తి చేయలేదని, అలాగే అదనపు అంతస్తు నిర్మించడంతో పాటు జిమ్‌ను కూడా ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. జీరా డైరీ ఫాం దగ్గర ఉన్న రెండు గదులను అందుబాటులోకి తీసుకొస్తే రీడింగ్ రూమ్, లైబ్రరీగా మార్చవచ్చని చెప్పారు. రాణిగంజ్‌లోని తెలంగాణ టూరిజం వద్ద అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్‌ను అందుబాటులోకి తెస్తే వాహనాల పార్కింగ్ సమస్య తీరుతుందన్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం చుట్టూ ఆక్రమణలతో నిండిపోయాయని రెండేళ్ల క్రితం శంకుస్థాపనలు చేసిన పనులు ఇంకా ప్రారంభించలేదని, కొన్ని కమ్యూనిటీ హాళ్ల స్థానిక నాయకులు కబ్జాలు చేసుకున్నారని వాటిని స్థానికులకు అందుబాటులోకి తేవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.

కార్పొరేటర్లు, అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశం



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిళ్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ రవికిరణ్ బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సర్కిళ్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల తీరు తెన్నుల గురించి చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించి డివిజన్ల వారీగా కార్పొరేటర్ల అభిప్రాయాలను స్వీకరించారు. ఎక్కువ సంఖ్యలోని కార్పొరేటర్లు తమ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి అధికారులకు నివేదించారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి అభివృద్ధి పనులను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణం, భూగర్భ పైప్‌లైన్ల విషయంలో ఇరు విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించడం ద్వారా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు వీలుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు

రసూల్‌పురా: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రపతి నిలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీఆర్, ప్రాథమిక చికిత్స ప్రక్రియను తెలియజేసేలా విద్యార్థులకు వీడియో చూపిస్తూ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా మాట్లాడుతూ.. సీపీఆర్ ఆవశ్యకతను విద్యార్థులు తెలుసుకుని బాధ్యతగల వ్యక్తులుగా సమాజంలో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ యూత్ రాష్ట్ర కన్వీనర్ ఎం. రమేష్, స్టేట్ కో– ఆర్డినేటర్ (సీపీఆర్) డాక్టర్ బి. విజయభాస్కర్, స్టేట్ ఈసీ, ఎంసీఈవీ. శ్రీనివాస్ రావు. ప్రాథమిక చికిత్స ట్రైనర్ రమణ పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్‌తో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 15న పూర్తిస్థాయి సెలవుతో పాటు బంజారాహిల్స్‌లో 108 అడుగుల సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శివాజీ విగ్రహానికి మరమ్మతులు చేయాలి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి మరమ్మతులు చేయాలని శివాజీ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ ఏఎస్ భాస్కర్‌గిరి జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19న శివాజీ జయంతి వేడుకలు నిర్వహించుకోనున్న నేపథ్యంలో విగ్రహం గద్దెకు మరమ్మతుతో పాటు చుట్టూ ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు.

లాస్యకు కేటీఆర్ పరామర్శ



రసూల్‌పురా: నల్గొండలో మంగళవారం జరిగిన కేసీఆర్ బహిరంగసభకు హాజరై తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందితను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం లాస్యనందిత నివాసానికి వచ్చి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

తప్పిపోయిన యువతి.. కుటుంబ సభ్యులకు అప్పగింత


యువతిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: తప్పిపోయిన ఓ యువతి కేసును రాంగోపాల్‌పేట్ పోలీసులు ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం..సింధీకాలనీకి చెందిన హరినాక్షి (19) మానసిక పరిస్థితి బాగా లేదు. ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటకు వచ్చి అదృశ్యమవ్వడంతో తల్లి ధనిదారియ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పీజీ రోడ్ నుంచి ఎల్‌బీనగర్, టోలిచౌకి, నార్సింగ్, లంగర్‌హౌజ్, హుమాయూన్‌నగర్ వరకు పరిశీలించారు. హుమాయూన్‌నగర్‌లోని రోడ్డు పక్కన ఉన్న ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన మహంకాళి ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైను అభినందించారు.